క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పద్మనాభం: పద్మనాభం సబ్‌స్టేషన్ పరిధిలోని రెడ్డిపల్లి ఫీడర్‌లో కొత్త కండక్టర్ ఏర్పాటు చేయనున్నందున, ఆ ఫీడర్ పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏఈ జగన్మోహన రావు తెలిపారు. శేరిఖండం, పొట్నూరు, రెడ్డిపల్లి, సుంకరపేట, భద్రయ్యపేట, తునివలస, నరసాపురం, చిన్నాపురం, విజయానందపురం, నేరేళ్లవలస, కొయ్యపేటలో ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

ఇస్కాన్‌లో మార్మోగిన హరినామస్మరణ



ప్రత్యేక అలంకరణలో శ్రీ రాధాకృష్ణులు

కొమ్మాది: హరే కృష్ణ, హరే రామ నామ సంకీర్తనలతో సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ మందిరం ఆదివారం మార్మోగింది. వారాంతపు ప్రత్యేక పూజల సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభుజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీతలోని శ్లోకాలను, అనేక ఆధ్యాత్మిక ప్రవచనాలను భక్తులకు వినిపించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ స్వామి, నరసింహస్వామి విగ్రహాలను వివిధ రంగుల పుష్పాలతో ప్రత్యేకంగా, నయనందకరంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కీర్తనలు ఆలపించారు.

వైభవంగా కాశీ విశ్వేశ్వర స్వామి వార్షికోత్సవం

తగరపువలస: భీమిలి మండలం అమనాంలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ 13వ వార్షికోత్సవాన్ని ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకు డు ఫణిరాజు కుమారశాస్త్రి ఆధ్వర్యంలో శివాలయంతో పాటు, ఉపాలయాలైన వినా యకుడు, పార్వతీ దేవి, షిర్డీసాయిబాబా, కనకదుర్గమ్మ, శ్రీకృష్ణుడు, నవగ్రహాలు, సుబ్రహ్మణ్యస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు చుక్క ఆదిరెడ్డి, చుక్క పోలయ్యరెడ్డి, బంకపల్లి రమణ, సారిక అప్పారావు, లక్కోజు శ్రీనివాసరావు, బోర అప్పల రెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో అవస్థలు

మధురవాడ: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మధురవాడ, పీఎంపాలెం పరిసర ప్రాంతాలలో కొనసాగుతున్న అనధికార విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫిర్యాదు చేయడానికి ఫోన్ చేసినా సిబ్బంది స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అప్రకటిత విద్యుత్ కోతలపై ప్రతిపక్ష పార్టీలతో పాటు అధికార పార్టీ నాయకులు కూడా సోషల్ మీడియా వేదికగా బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం పీఎం పాలెం పరిసర ప్రాంతాలలో గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అంతకుముందు శనివారం రాత్రి 11 గంటల నుంచి 1 గంట వరకు, శుక్రవారం కూడా ఇదే పరిస్థితి నెలకొందని ప్రజలు చెబుతున్నారు. ఈ సమస్యపై ఉన్నత స్థాయి అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన కన్నుల పండుగగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై కొలువుదీర్చారు. అర్చకులు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అనంతరం, 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామివారికి అష్టోత్తర శతనామావళి పూజ భక్తిశ్రద్ధలతో చేశారు. ఈ ఆర్జిత సేవలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అంతేకాకుండా ఆదివారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్య కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయం 9:30 గంటల నుంచి ఆలయ కల్యాణ మండపంలో ఈ వేడుకను నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంచేపచేశారు. వేద పండితులు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు వంటి ఘట్టాలతో శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపించారు.

రోడ్డు దాటాలంటే తెగించాల్సిందే..!

మధురవాడలో రైలింగ్, సెంటర్ గ్రిల్స్‌తో తీవ్ర ఇబ్బందులు



జాతీయ రహదారికి రెండు వైపులా రైలింగ్ మధ్యలో నిర్మించిన గ్రిల్స్



రోడ్డు దాటడానికి గ్రిల్స్ ఎక్కుతున్న యువకుడు



మధురవాడ బస్టాప్ వద్ద గ్రిల్స్ పై నుంచి రోడ్డు దాటుతున్న వ్యక్తి

అందుబాటులోకి రాని నడకదారి వంతెన

యమపాశంలా సెంటర్ లైటింగ్ ఫోల్స్

ప్రమాద భరితంగా వేలాడుతున్న విద్యుత్ వైర్లు



రోడ్డు దాటడానికి గ్రిల్స్ ఎక్కుతున్న యువతి



ప్రమాద భరితంగా విద్యుత్ వైర్లు



ఈ విద్యుత్ వైర్లు తగిలి ఇటీవల పెయింటర్ మృతి

పీఎంపాలెం: స్థానిక క్రికెట్ స్టేడియం నుంచి కొమ్మాది కూడలి వరకు విస్తరించి ఉన్న జాతీయ రహదారి, పాదచారుల పాలిట మృత్యు మార్గంగా మారింది. ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలు విపరీతంగా పెరగడంతో రోడ్డు దాటడం అత్యంత ప్రమాద కరంగా మారింది. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఇక్కడ నడక దారి వంతెన నిర్మించాలనే ప్రతిపాదనలు ఎన్నో ఏళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. దీనికి తోడు, క్రికెట్ స్టేడియం సిగ్నల్ పాయింట్ నుంచి కొమ్మాది కూడలి వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర సెంటర్ లైటింగ్ ఏర్పాటులో భాగంగా విద్యుత్ స్తంభాలు నెలకొల్పారు. ఈ స్తంభాల పైభాగంలో ఎల్‌ఈడీ దీపాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు దిగువన ప్రత్యేక ఇన్నర్ వైర్ బాక్సులు ఏర్పాటు చేశారు. అయితే, వైర్లు బయటకు కనిపించకుండా సంబంధిత శాఖ ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోలేదు. విద్యుత్ ప్రమాదం జరిగే అవకాశం ఉన్నప్పటికీ, కనీసం ప్రమాదాన్ని సూచిస్తూ హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం దారుణం.

మహిళలు, వృద్ధులు సిగ్నల్స్ వద్ద కాకుండా ఇతర ప్రాంతాల్లో జాతీయ రహదారిని దాటడం అసాధ్యంగా మారింది. దీంతో కొందరు బాధ్యతారాహిత్యంగా రైలింగ్‌లను, సెంటర్ గ్రిల్స్‌ను దాటే ప్రయత్నం చేసి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కృష్ణ కుమార్ అనే వ్యక్తి రోడ్డు మధ్యలో ఉన్న గ్రిల్స్‌పై నుంచి దాటుతుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందడం కలచివేసింది. ఇంత విషాదం జరిగినప్పటికీ, మృతి చెందిన ప్రదేశంలో కనీస ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం సంబంధిత శాఖల నిర్లక్ష్యపు వైఖరికి నిదర్శనం.

వంతెన నిర్మాణం అలస్యం

నడక దారి వంతెన నిర్మాణం ఆలస్యం కావడం, విద్యుత్ స్తంభాల వద్ద భద్రతా చర్యలు శూన్యంగా ఉండటం ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, పెండింగ్‌లో ఉన్న నడక దారి వంతెన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని, విద్యుత్ స్తంభాల వద్ద తగిన రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు వేడుకుంటున్నారు. ఒక అమాయక ప్రాణం పోయినా అధికారులు మేల్కోకపోతే, మరిన్ని విషాదాలు చోటుచేసుకునే ప్రమాదం లేకపోలేదు.

ఎన్నో అవస్థలు

వైఎస్సార్ క్రికెట్ స్టేడియం నుంచి సుమారు రెండు కిలోమీటర్ల మేర రోడ్డు దాటడానికి కారుషెడ్ కూడలి, కొమ్మాది కూడలి సిగ్నల్స్ మాత్రమే సురక్షితమైన ప్రదేశాలుగా ఉన్నాయి. మధురవాడ, చంద్రంపాలెం బస్టాప్‌ల వద్ద దిగిన ప్రయాణీకులు అటువైపు లేదా ఇటువైపు వెళ్లాలంటే కిలోమీటరు దూరం వరకు ఉన్న కొమ్మాది లేదా కారుషెడ్ కూడలికి చేరుకోవలసి వస్తోంది. వృద్ధులు, మహిళలు ఈ దూరం నడవలేక ఆటోలను ఆశ్రయిస్తుండగా, యువకులు మాత్రం ప్రాణాలను పణంగా పెట్టి, రహదారి మధ్యలో ఉన్న నాలుగడుగుల ఎత్తైన గ్రిల్స్ మీదుగా ప్రమాదకరంగా రోడ్డు దాటుతున్నారు. ఇలాంటి ప్రయత్నాల్లో చాలా మంది ప్రమాదాలకు గురవుతున్నారు. దురదృష్టకరమైన విషయం ఏమిటంటే, ఎదురుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉన్నప్పటికీ, విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి కిలోమీటర్ల మేర తిరిగి వెళ్లాల్సి వస్తోంది. లేదా ప్రాణాలకు తెగించి రైలింగ్‌లు, గ్రిల్స్ ఎక్కి రోడ్డు దాటాల్సిన దుర్భర పరిస్థితి నెలకొంది. ఇది ఇక్కడి ప్రజలకు నిత్యకృత్యంగా మారింది. నడకదారి వంతెన ప్రాముఖ్యతను గుర్తించిన స్థానిక ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి, యుద్ధ ప్రాతిపదికన నడకదారి వంతెనను నిర్మించి ఈ దుస్థితిని మెరుగుపరచాలని వేడుకుంటున్నారు.

నిధులు మంజూరు చేయాలి



పీఎంపాలెం మధురవాడ ప్రాంతాలలో అధిక జనాభాను దృష్టిలో ఉంచుకుని వెంటనే నడక దారి వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి. వంతెన నిర్మాణంకాకపోవడంతో రోడ్డు ఎలా దాటాలో తెలియక ఆందోళన చెందుతున్నాం. చిన్నపిల్లలు, విద్యార్థులు,మహిళలు, వృద్ధులను దృష్టిలో ఉంచుకుని వెంటనే నడక దారి వంతెన నిర్మించాలి. అలాగే సెంటర్ లైటింగ్ స్తంభాల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

-ఎం. వెంకటరావు, మధురవాడ

కేవీఆర్ మెమోరియల్ క్రికెట్ విజేత గొల్లల తాళ్లవలస



విజేత జట్టుకు ట్రోఫీ, నగదు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలోని రెండో వార్డు సంగివలసలో గత 20 రోజులుగా జరిగిన కోల వెంకటరావు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ఘనంగా ముగిసింది. ఉత్కంఠ భరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో గొల్లల తాళ్లవలస జట్టు విజయం సాధించి రూ.30 వేల బహుమతితో పాటు ట్రోఫీని కైవసం చేసుకుంది. చిల్లపేట జట్టు రన్నర్‌గా నిలిచి రూ.20 వేల బహుమతిని అందుకుంది. లొడగలవానిపాలెం జట్టు మూడో స్థానంలో నిలిచి రూ.5 వేల బహుమతిని, ట్రోఫీని గెలుచుకుంది. టోర్నమెంట్‌లో రాణించిన ఆటగాళ్లకు కూడా బహుమతులు అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన ఆటగాడికి రూ.3 వేలు, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బౌలర్, ఫీల్డర్‌లకు ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున బహుమతిని అందజేశారు. విజేతలకు అక్కరమాని మంగరాజు, గంటా సూకరాజు, కొక్కిరి అప్పన్న చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. టోర్నమెంట్ నిర్వాహకులు కోల త్రినాథ్ , గిరి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



ఆనందపురం జెడ్పీ హైస్కూల్‌లో సమావేశం అయిన పూర్వ విద్యార్థులు

తగరపువలస: ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989-90, 2013-14 బ్యాచ్‌ల పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థులు తమ వృత్తిపరమైన జీవితంలో ఉన్నతంగా ఎదగాలని, అలాగే సమాజానికి సహాయపడుతూ ఉండాలని ఆకాంక్షించారు. పూర్వ విద్యార్థుల కష్ట సుఖాల్లో పాలుపంచుకోవడానికి తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని వారు తెలిపారు. అంతకుముందు ఈ పాఠశాలలో చదివి మృతి చెందిన తమ స్నేహితులను, ఇటీవల ఆర్మీలో వీరమరణం పొందిన తిరుపతిరావును, ఉపాధ్యాయుడు ఎస్‌వీఆర్ సత్యనారాయణను స్మరించుకుంటూ పూర్వ విద్యార్థులు నివాళులర్పించారు. అనంతర, పూర్వ విద్యార్థులు లక్ష్మీ తారకేశ్వరరావు, సన్యాసిరావు, కేఆర్కే పట్నాయిక్, రాణి, జాన్ రబ్బీ, నాగమౌళి, వెంకట చలపతి, చంద్రకుమారి, అశోక్ నందలను సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ ఆత్మీయ కలయికలో పూర్వ విద్యార్థులు సంపంగి అనిల్, బంటుపల్లి ఈశ్వరరావు, వంశీ, ఉప్పిలి వెంకట్, కంది రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన నరసింగరావు

తగరపువలస: తగరపువలస: భీమిలి జోన్ వలందపేట జాతీయరహదారిపై ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. విజయనగరం జిల్లాలోని కణపాక గ్రామానికి చెందిన శీల నరసింగరావు వలందపేటలో జరిగిన ఒక శుభ కార్యానికి హాజరై తిరిగి ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆయన రోడ్డు దాటుతుండగా తగరపువలస నుంచి విశాఖ వైపు వేగంగా వస్తున్న ఒక ద్విచక్రవాహనం ఆయనను బలంగా ఢీకొట్టింది. ద్విచక్రవాహనంపై వెనుక కూర్చున్న అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం రేవు పోలవరం గ్రామానికి చెందిన వ్యక్తితో పాటు, నరసింగరావు కూడా తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108కి ఫోన్ చేసినప్పటికీ, అంబులెన్స్ గంటసేపు రాకపోవడంతో ఆలస్యమైంది. అనంతరం సంగివలసలోని అనిల్ నీరుకొండ ఆస్పత్రికి చెందిన అంబులెన్స్ ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తరలించాయి.

పెద్ద చెరువు అవుట్‌లెట్లు తెరిపించాలి

తగరపువలస: చిట్టివలస పెద్ద చెరువు సుందరీకరణ పనులు చేపట్టే ముందు మూసివేసిన అవుట్‌లెట్లను తెరవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు జీరు వెంకట రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం జీరుపేటలో ఆయన మాట్లాడుతూ, బొగ్గురోడ్డులోని శ్రీకృష్ణా విద్యాసంస్థల సమీపంలో, సుఖీభవ కాలనీ వద్ద మూసివేసిన మూడు అవుట్‌లెట్లను వెంటనే తెరిపించాలని కోరారు. సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రి నుంచి వెలువడే వ్యర్థాలు చెరువులో కలవడం వల్ల దానిని ఆనుకుని ఉన్న ఐదు గ్రామాల ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.అలాగే సుఖీభవ కాలనీ నుంచి వచ్చే వ్యర్థాలను వ్యవసాయ భూముల్లోకి వదలడం వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారని ఆయన తెలిపారు. చెరువు ఆక్రమణకు గురైందని, ఆక్రమణదారుల నుంచి తొలగింపు చర్యలు చేపట్టాలని జీవీఎంసీ, ఇరిగేషన్ శాఖ, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావులను ఆయన కోరారు.

7 నుంచి ఉచిత యోగా శిక్షణ శిబిరం

మహారాణిపేట: నేటి స్పీడ్ యుగంలో విద్యార్థులు, ఉద్యోగులు, వయోవృద్ధులు మానసిక ఒత్తిడికి లోనై అనేక రుగ్మతల పాలిట పడుతున్నారు. క్షణికావేశంలో పొరపాట్లు చేస్తున్నారు. ఒత్తిడి నివారణకు యోగా చేయాలని ప్రకృతి చికిత్సాలయం యోగ సాధకురాలు డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి తెలిపారు. ఈ నెల 7 నుంచి అందరికీ ఉచితంగా యోగాలో శిక్షణ ఇస్తామన్నారు. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. బీచ్ రోడ్డులోని ప్రకృతి చికిత్సాలయంలో శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. వయోభేదం లేకుండా మహిళలు, పురుషులు,విద్యార్థులందరికీ నెల రోజుల పాటు శిక్షణ ఇస్తున్నామన్నారు.

'మతం మారిన క్రైస్తవులపై హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం'

తగరపువలస: దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించడం రాజ్యాంగ విరుద్ధమని, మతం మారిన క్రైస్తవులకు ఎస్సీ హోదా ఉండదని హైకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును సామాజిక కార్యకర్త, ప్రముఖ గేయ రచయిత ఐనాడ దుర్గాప్రసాద్ స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మతం మారినవారు హిందూ ఆచార వ్యవహారాలు పాటించరని, అంతేకాకుండా రక్త సంబంధీకులను కూడా అన్యుల పేరుతో దూరం పెడతారన్నారు. తల్లిదండ్రుల అంత్యక్రియలకు కూడా దూరంగా ఉన్న సంఘటనలు ఉన్నాయని పేర్కొంటూ, అటువంటి వారు ఎస్సీలు ఎలా అవుతారని ఆయన ప్రశ్నించారు. హైకోర్టు తీర్పు దురదృష్టకరమని పేర్కొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు వ్యాఖ్యలను దుర్గాప్రసాద్ తీవ్రంగా ఖండించారు. క్రైస్తవంలో కులవివక్ష ఉంటే మతం మారే అవసరం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి ప్రకటనలు కోర్టులను, రాజ్యాంగాన్ని అవమానపరచడమేనని ఆయన అభిప్రాయపడ్డారు.

రైతుబజార్‌లో ఆటో డ్రైవర్‌పై దాడి

బీచ్‌రోడ్డు: ఆటోల నుంచి కూరగాయలు, పండ్లు దింపే క్రమంలో ఇద్దరు ఆటో డ్రైవర్ల మధ్య గొడవ జరిగి ఒకరిపై భౌతిక దాడులు చేశారు. ఇదంతా ఎస్టేట్ ఆఫీసర్ ముందే జరిగినా.. తనకేం సంబంధం లేదన్నట్లు ఈవో వ్యవహరించడంతో గొడవ పోలీస్ స్టేషన్‌కు చేరింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. గ్రామీణ ప్రాంతం నుంచి ఒక ఆటో డ్రైవర్ కూరగాయలు తీసుకొని ఆదివారం పెదవాల్తేరు రైతుబజారుకు వచ్చాడు. అదే సమయంలో జ్ఞానాపురానికి చెందిన మరో ఆటో డ్రైవర్ బజారుకు పండ్లు తీసికొచ్చాడు. ఈ ఆటోల నుంచి సరకులు దింపేందుకు కలాసీల విషయంలో ఇద్దరు డ్రైవర్ల మధ్య గొడవ ప్రారంభమైంది. జ్ఞానాపురం ఆటో డ్రైవర్ కొబ్బరితోట ప్రాంతం నుంచి కొంత మందిని రప్పించి గ్రామీణ ప్రాంత ఆటో డ్రైవర్‌పై దాడి చేసి చితకబాదారు. శరీరంపై ఉన్న దుస్తులు మొత్తం చిరిగి, గాయాల పాలైన ఆ ఆటో డ్రైవర్ మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గ్రామీణ ఆటో డ్రైవర్‌పై దాడి చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాగైతే తమ కూరగాయలను ఎవరూ బజారుకు తీసుకొస్తారని ఆవేదన వ్యక్తం చేశారు.

చోద్యం చూసిన ఎస్టేట్ ఆఫీసర్

గ్రామీణ ప్రాంతం నుంచి కూరగాయలు తీసుకొచ్చే ఒక ఆటో డ్రైవర్‌పై కొంత మంది బయట వ్యక్తులు దాడి చేస్తుంటే.. అక్కడే ఉన్న ఎస్టేట్ ఆఫీసర్ సత్యవేణి చోద్యం చూశారు. ఇంత గొడవ జరిగినా కనీసం ఆటో డ్రైవర్ల పేర్లు కూడా ఆమె తెలుసుకోకపోవడం విధుల్లో ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో తెలుస్తోంది. పోలీసులకు కనీస సమాచారం ఇవ్వకపోవడం, గొడవను ఆపేందుకు ప్రయత్నించని ఈవో తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



అన్నమయ్య కీర్తనకు కూచిపూడి నృత్యం

పీఎంపాలెం: వారాంతపు వినోదంలో భాగంగా శిల్పారామంలో ఆదివారం సాయంత్రం జరిగిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా అలరించింది. శ్రీ రాజేశ్వరీ కూచిపూడి కళామిత్ర కేంద్రంలో శిక్షణ పొందిన చిన్నారులు తమ నృత్యంతో అందరినీ ఆకట్టుకున్నారు. 'మహాగణపతిం భజే' అనే గీతంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో కళాకారులు 'బ్రహ్మమొక్కటే...', 'మూషిక వాహన...', 'రామాయణ శబ్దం...', 'అదివో అల్లదివో...', 'గోవింద గోవింద...', 'భావములోన...' వంటి అన్నమయ్య కీర్తనలకు చక్కగా నృత్యం చేశారు. ప్రదర్శనలో కె. కృతిక, వీక్షిత, బాల భార్గవి, ప్రియదర్శిని, ఉజ్వల, శ్రీజ, సిద్దేశ్వర్, హిమ స్వరూప్, సాయి కౌషిక్ పాల్గొన్నారు. కార్యక్రమ పర్యవేక్షణను ఇన్‌చార్జ్ ఏవో రమణ నిర్వహించారు.

సీపీఐ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



మధురవాడలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

మధురవాడ: కంచరపాలెంలో జరగనున్న జిల్లా 25వ మహాసభల పోస్టర్‌ను సీపీఐ నాయకుడు సత్యనారాయణ తదితరులు మధురవాడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10న నిర్వహించనున్న బహిరంగ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జాతీయ నాయకులు నారాయణ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ మహాసభల్లో కార్మికుల సమస్యలతో పాటు, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, విశాఖ రైల్వే జోన్ వంటి కీలక అంశాలపై నాయకులు విస్తృతంగా చర్చిస్తారని, భవిష్యత్ పోరాట కార్యక్రమాలకు రూపకల్పన చేస్తారని ఆయన వెల్లడించారు. ఈ బహిరంగ సభకు కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఠా కార్మిక నాయకులు అప్పలరాజు, రాంబాబు, సోములు, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి



ఉప్పాడలో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌ఐ మురళీకృష్ణ

కొమ్మాది: తీర ప్రాంత మత్స్యకారులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని మెరైన్ ఎస్‌ఐ మురళీ కృష్ణ సూచించారు. ఆదివారం ఆయన కొమ్మాది సమీపంలోని తీర ప్రాంతాలైన ఉప్పాడ, కాపులదిబ్బడపాలెం, మంగమారిపేట గ్రామాల్లో మత్స్యకారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెరైన్ ఎస్‌ఐ మాట్లాడుతూ, ప్రస్తుతం వేట నిషేధ సమయం అమల్లో ఉన్నందున ఎవరూ వేటకు వెళ్లకూడదని స్పష్టం చేశారు. అదేవిధంగా, దక్షిణ కాశ్మీర్ లో ఉగ్రవాద కార్యకలాపాల వల్ల ఎదురయ్యే భద్రతాపరమైన బెదిరింపుల గురించి మత్స్య కారులకు వివరించారు. తీర ప్రాంతాల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు సంచరిస్తున్నట్లు కనిపిస్తే వెంటనే తమకు తెలియజేయాలని ఆయన కోరారు. అప్రమత్తంగా ఉండటం ద్వారా అవాంఛనీయ ఘటనలను నివారించవచ్చన్నారు.

ఉప్పు సాగుకు వర్షం దెబ్బ



వర్షానికి నిండిపోయిన మూలకుద్దు ఉప్పుగల్లీలు



వర్షం నుంచి రక్షణగా ఉప్పు కుప్పలపై తార్పాన్లు కప్పిన దృశ్యం

తగరపువలస: భీమిలి మండలం మూలకుద్దులో ఈ సీజన్‌లో ఉప్పు సాగుకు భారీ నష్టం వాటిల్లింది. గత ఏడాది అక్టోబర్, డిసెంబర్ నెలల్లో కురిసిన అకాల వర్షాల కారణంగా ఉప్పు సాగు ఆలస్యంగా ప్రారంభమైంది. సాధారణంగా నవంబర్ నుంచి జూలై వరకు సాగే ఈ పంటకు, రైతులు అక్టోబర్ నాటికే ఉప్పు మడులను సిద్ధం చేస్తారు. అయితే సీజన్ ప్రారంభానికి ముందే కురిసిన వర్షాల వల్ల ఇక్కడి గల్లీలలోని 99 ఎకరాలలో కేవలం 22 ఎకరాల్లో మాత్రమే సాగు చేపట్టడానికి రైతులు ముందుకు వచ్చారు. ఉప్పు సాగుకు ఎండ వేడిమి, అధిక ఉక్కపోత అవసరం. కానీ గత నెల 29న కురిసిన భారీ వర్షానికి గల్లీలు నీట మునిగిపోయాయి. అప్పటివరకు సాగు చేసిన పంట పూర్తిగా దెబ్బతింది. ఆ తర్వాత కూడా మేఘావృతమైన వాతావరణం, అడపాదడపా వర్షాల కారణంగా ఉప్పు సాగుకు తాత్కాలికంగా అంతరాయం ఏర్పడింది. దీంతో రైతులు పనులు నిలిపివేసి ఇళ్లకు చేరుకున్నారు. ఉప్పు అమ్మకాలు కూడా పూర్తిగా ఆగిపోయాయి.భీమిలి మండలంలోని మూలకుద్దుతో పోలిస్తే, పూడిమడక, చినగంజాం , నౌపడ, సీతానగరం, భావనపాడు వంటి ప్రాంతాల్లో ఉప్పు సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉండటంతో అక్కడ తక్కువ ధరలకు ఉప్పు లభిస్తుంది. ఈ కారణాల వల్ల మూలకుద్దులో గత కొంతకాలంగా ఉప్పు సాగు గణనీయంగా తగ్గిపోయింది.